అశాశ్వతమని గ్రహించి, బ్రహ్మ పదార్థం ఒక్కటే శాశ్వతమని అర్థం చేసుకోగలుగుతాడు. చివరిది సాలెపురుగు స్థితి. సాలీడు తననించి దారాన్ని తయారుచేసి తిరిగి దాన్ని ఎలా మింగుతుందో, అలా తన మనసుతో తాను చేసుకున్న ఈ ప్రపంచాన్ని తిరిగి మింగి ఆ సాధకుడు చివరికి తనే బ్రహ్మం కాగలుగుతాడు." వాటిలోని అంతరార్థాన్ని వివరించారు గురువుగారు.

త్వరలోనే ఆ శిష్యుడికి ఆత్మజ్ఞానం లభించి ముక్తుడయ్యాడు.

## 24. అంచెలంచెలు

మోక్షం మీద మమకారం గల ఒకతను మంచి గురువు కోసం వెదుక్కుంటూ అనేక ప్రదేశాలు తిరిగాడు. చివరికి అతనికి శ్రీశైలంలోని ఘంటా మఠంలోని స్వరూపానంద స్వామితో పరిచయమైంది. నిష్ఠగా జీవితాన్ని గడిపే ఆయన మీద గౌరవం కలగడంతో తనని శిష్యునిగా స్వీకరించమని వేడుకున్నాడు. అందుకాయన అంగీకరించి చెప్పాడు.

"నాకు తెలిసిందంతా నీకు బోధిస్తాను."

గురువుతో అదే మఠంలో నివశిస్తూ శిష్యుడు హఠ, ధ్యాన యోగాలని అనుష్ఠించ సాగాడు. అలా కొన్నాళ్ళు గడిచాక శిష్యుడికి తను సరైన మార్గంలోనే వున్నాడా అన్న అనుమానం మొదలై క్రమేపీ అది తీవ్రమైంది.

ఓ రోజు గురువు శిష్యుడి వంక వాత్సల్యంగా చూస్తూ అడిగాడు.

"ఇటీవల చాలా కలవర పడుతున్నావు. నీ సందేహం ఏమిటి?"

"స్వామీ! ఆధ్యాత్మిక సాధన చేసే కొద్దీ మనసు స్వచ్ఛమవుతుందని శాస్త్రాలు చెప్తున్నాయి. నేనిక్కడికొచ్చి రెండేళ్ళు గడిచాయి. ఎంత తీవ్రంగా సాధన చేసినా నా మనస్సు స్వచ్ఛంగా మారడం లేదు. స్త్రీని చూస్తే ఇదివరకటిలాగే మనసు ఆలోచిస్తోంది. ఇలాగే ప్రతీ భోగ విషయంలో జరుగుతోంది. ఎందుకిలా?" అడిగాడు శిష్యుడు.

గురువు చిన్నగా నవ్వి చెప్పాడు.

"శిష్యా! నేను నీ కన్నా పవిత్రుడినని, అలాగే శిష్యులని చేరదీసే గురువులంతా పవిత్రులని అనుకోకు. ఆధ్యాత్మిక మార్గంలో చిట్టచివరి స్థితికి చేరుకుని ఆత్మ సాక్షాత్కారం పొందేదాకా ఎంతటి గొప్ప సాధకుడినైనా అరిషడ్వర్గాలైన, కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలు వదలవు. అవి సమూలంగా నాశనమవడమే ముక్తి. నిజానికి కామ క్రోధాలు లేకపోతే మనిషి కర్మ చేయడం కుదరదు. వాటి ప్రేరణతోనే మనిషి కర్మచేసేది. ఈ కర్మాచరణ లేకపోతే జన్మ ఎత్తడమే జరగదు. శ్రీకృష్ణుడు లాంటి అవతార పురుషులు పొందే మనుష్య జన్మ, లోక శ్రేయస్సు కోసమే కాబట్టి, కేవలం అలాంటి వారికే అరిషడ్వర్గాలని జయించడం సాధ్యం."

"మరెలా స్వామీ?" ఆందోళనగా అడిగాడు శిష్యుడు.

"నీకు గమనింపుకి రాకపోయినా, నీ మనసు ఈ సాధనవల్ల పరిశుద్ధమవుతూనే వుంటుంది. సాధనవల్ల మనసులోని మురికి తప్పక పోతుంది. అయితే అందుకు కొన్ని జన్మలు పడుతుందని గీతలో కృష్ణుడు 'బహు జన్మానాం' అన్నాడు. చిలుం పట్టిన ఇత్తడి గిన్నెని ఓ రోజు తోమినంత మాత్రాన మొత్తం చిలుము వదులుతుందా? అలాగే అనేక జన్మల నించీ పేరుకుంటూ వచ్చిన దుష్కర్మలు రెండేళ్ళలో ఎలా వదులుతాయి?"

ఇంకే ఆలోచనలు పెట్టుకోకుండా ఆ శిష్యుడు అదే పనిగా తీవ్రంగా ఆధ్యాత్మిక సాధనచేసి ఆ జన్మలోనే బ్రహ్మజ్ఞానం పొందాడు.

## 25. ఆత్మ స్వరూపం

ఓ రాజుగారు ఓసారి ఓ ఆధ్యాత్మిక గురువు చెప్పే ఉపన్యాసం విన్నాడు.

"ప్రతీ జీవిలో ఆత్మ ఉంటుంది. ఆ ఆత్మ ఒక్కటే సత్ పదార్థం. అది అణువు కన్నా చిన్నది. ప్రపంచం యావత్తూ ఆ ఆత్మ నించే పుట్టింది.